అసహనంతోనే హేమలతపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోపణలు

విశాలాంధ్ర- సత్యవేడు: ఈసారి టికెట్టు రాదన్న అసహనంతోనే మాజీ ఎమ్మెల్యే హేమలతపై ప్రస్తుత శాసనసభ్యులు ఆదిమూలం లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్టు టీడిపి జిల్లా ఎస్సి సెల్ అధ్యక్ష్యుడు శ్రీపతి బాబు విమర్శించారు. సత్యవేదులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ డాక్టర్ హెలెన్,మాజీ ఎమ్మెల్యే హేమలత ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్ష్యుడు బాబు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హేమలత పై చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. సుప్రీంకోర్టు సైతం క్రిస్టియానిటీ ఒక మతానికి సంబంధించింది అని, కులం కాదని పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కులం పైన కాదు. ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో మీరు చేసిన అభివృద్ధిపై చర్చకు రండని సవాల్ విసిరారు. మహిళలన్న విజ్ఞత లేకుండా వస్త్రధారణ పై అవహేళనగా మాట్లాడుతూ హేమలత,హెలెన్లను మానసిక వేధింపులకు గురి చేయడం తగదు అన్నారు. ఒక ఎమ్మెల్యే స్థాయిలో హుందాగా వ్యవహరించాల్సిన వ్యక్తి ఇలా దిగజారుడు రాజకీయాలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. పార్టీలో టిక్కెట్టు రాదనే అసహనం,తాను గొప్ప నాయకుడని అధిష్టానంలో మెప్పుకోసం తప్పితే ఎమ్మెల్యే ఆరోపణలలో పసలేదని కొట్టి పారేశారు. మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ తాను 1997న తెలుగుపార్టీ సభ్యత్వం పొందానని చెప్పారు. అప్పటినుండి ప్రజల అభీష్టం మేరకే రాజకీయాలలో కొనసాగుతున్నాని తెలిపారు. 2001లో తాను ఎంపిపి గా ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేసిన ఆదిమూలంకు గుర్తుకురాని కులం ఇప్పుడు రావడం సమంజసం గా లేదన్నారు. తాను బ్రిటీష్ పాఠశాలలో చదవటం వల్ల క్రిష్టియానిటీ అనే పదం వచ్చిందన్నారు. క్రిష్టియానిటీ అనేది కులం కాదని ఎమ్మెల్యే ఆదిమూలం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఆదిఆంధ్రవాడ ఎస్సీ షెడ్యూల్డ్ కులంకు చెందిన వారిమే నని చెప్పుకొచ్చిన ఆమె ఇకనైనా ఎమ్మెల్యే ఆదిమూలం సందేహాలు నివృత్తి అవుతాయని అనుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్చార్జ్ హెలెన్, నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, పరమశివం,ఎండి కుమార్,ఎమ్మెస్ రవి,మండేలా తదితరులు పాల్గొన్నారు.

జంగమయ్య సన్నిధిలో 'హైటెక్ యాచకం'

ఆలయ పరువు తీస్తున్న ఉద్యోగులు - నిద్రావస్థలో దేవదాయశాఖ



విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో హైటెక్ యాచకులు ఎక్కువయ్యారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయంలో కొంతమంది ఉద్యోగుల తీరుతో పరువు పోతోంది. ఆలయ ప్రతిష్ట కాపాడాల్సిన అధికారులూ తామేమీ తక్కువ కాదనే తీరుతో వ్యవహరిస్తున్నారు. ఆలయ పరిస్థితులు చూసి ముక్కంటి భక్తులు మనోవేదనకు గురవుతున్నారు. ముక్కంటీ...! మీ పరువు మీరే కాపాడుకోండి అంటూ భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ దేవదాయశాఖ దొంగ నిద్ర నటిస్తోంది. శ్రీకాళహస్తీశ్వర ఆలయం రాహు-కేతు సర్పదోష నివారణ పూజలకు ఖ్యాతిగాంచింది. దేశ, విదేశాలకు చెందిన భక్తులు నిత్యం ఈ పూజల కోసం శ్రీకాళహస్తికి వస్తుం టారు. ఈ ఆలయానికి రోజుకు సగటున 30వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. వీరిలో సుమారు 4వేల నుంచి 5వేల మంది వరకు రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకుంటూ ఉంటారు. భక్తుల నమ్మకం, విశ్వాసం, మనోభావాలను ముక్కంటి ఆలయంలో కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఆలయ ప్రాంగణంలోకి అడుగు పెడితే చాలు పైరవీలు ప్రారంభమవుతాయి. స్థాయిని బట్టి భక్తులను ఇదిగో పూజ... అదిగో దర్శనం అంటూ నగదును వసూలు చేసుకుని ఆలయ పరిసరాల్లోకి పంపిస్తారు. తీరా అక్కడికి వెళితే కానీ భక్తులకు తెలియదు తాము మోసపోయామని. ఇక అక్కడ నుంచి ఆలయ సెక్యూరిటీ సిబ్బంది, హోంగార్డులు, పీఆర్వో కార్యాలయంలో ఉన్న అనధికారిక సిబ్బంది వారి మాటలతో భక్తులకు నమ్మకం కలిగిస్తారు. దర్శనానికి ధర నిర్ణయిస్తారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం... శిఖర గోపురం, దక్షిణామూర్తి సన్నిధానం అన్నీ చూపుతామంటూ భక్తులను మాటలతో బురిడీ కొట్టిస్తారు. వీరు ఇలా వసూలు చేస్తే... ఆలయంలో పని చేసే కొందరు డోలు విద్వాంసులు భక్తులకు దండం పెట్టి అడుక్కోవడం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉంది. రూ.వేలల్లో జీతాలు తీసుకోవడం చాలదంటూ అడుక్కోవడం ఏమిటని భక్తులు వాపోతున్నారు. భగవంతుని సేవలో తరించే డోలు విద్వాంసులు... సంగీత విద్వాంసులు ఇలా భక్తులను అడుక్కోవడం సబబు కాదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేయి తడిపితేనే.శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకోవడం తమ పూర్వ జన్మ సుకృతంగా భక్తులు భావిస్తుంటారు. అంతరాలయ దర్శనం చేసుకుంటే తమ జన్మ తరించినట్లేనని భక్తులు భావిస్తారు. భక్తుల ఈ విశ్వాసాన్ని కొంతమంది ఉద్యోగులు సొమ్ము చేసుకుంటున్నారు. అంతరాలయ దర్శనం కావాలంటే ఉద్యోగులకు చేయి తడపాల్సిందే. లేదంటే ఏవో ఒకసాకు చెప్పి పంపేస్తారు. ముక్కంటి ఆలయంలో ప్రస్తుతం హారతులు ఇచ్చే తట్టలకు స్వస్తి పలికారు. ఇది మంచి నిర్ణయమే. ప్రధాన ఆలయం, పరివార దేవతల వద్ద విధుల కోసం అర్చకులు కొంతమంది అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారనే బలమైన ఆరోపణ ఉంది. ఇక్కడ ఆదాయం ఎక్కువగా ఉన్నందునే ఇలా మామూళ్లు చెల్లించి మరీ విధులు వేయించుకుంటున్నారనే ఆరోపణ బలంగా ఉంది. దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి ఈ హైటెక్ యాచకులపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని కరణాలవీధి, బాలాజీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ, పురపాలక కమిషనర్ సాయినాథ్ పర్యటించారు. కరణాలవీధి నుండి బాలాజీనగర్ కు వెళ్ళే దారిలో కల్వర్టు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతుండేవారు. కోవిడ్ సమయంలో మరీ ఇబ్బందులు పడుతుంటే స్థానికులు ఇదే విషయాన్ని స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ దృష్టికి అప్పట్లో తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆమె కల్వర్టు నిర్మాణాన్ని పీఎస్సార్ ట్రస్టు అద్వర్యంలో చేపడుతామని స్థానికులకు మాటిచ్చారు. ఆ ప్రకారంగా అక్కడ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భాగంగానే దేవసేనమ్మ, కమిషనర్ సాయినాథ్ శనివారం కల్వర్టును పరిశీలించారు. ఆయా ప్రాంతాల ప్రజలు కూడా పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. వీలైనంత త్వరితగతిన కల్వర్టు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో సాయి, స్వరూప్, సూర్యనారాయణ,ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ రక్ష కుటీరంలో కలశ స్థాపన

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు రెండవ పట్టణ పరిధిలోని శ్రీరామరక కుటీరంలో హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం కలశ స్థాపన, గోపూజ, గురుదేవుల సుమంగళం, అంకురార్పణ కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర - గూడూరు : ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శ్రీ వెంకయ్యస్వామి పీఠం మెడనూరు సురేష్ రెడ్డి, శాంతి దంపతుల సహాయ సహకారాలతో వృద్ధులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, విశ్రాంత ఎస్ఐ ప్రభాకర్, కుమార్ నాయుడు, కోట వెంకటేశ్వర్లు, వెంకట కృష్ణయ్య, నాగరాజు, కృష్ణారెడ్డి, తూపిలి జస్వంత్, తూపిలి యశ్వంత్, సతీష్ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖామంత్రిని కలిసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు శాసనసభ్యులు డాక్టర్ శ్రీ వెలగపల్లి వరప్రసాద్ రావు శనివారం విశాఖ పట్నంలో పరిశ్రమల శాఖా మంత్రి అమర్నాథ్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. గూడూరులో ఆటోనగర్ మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. గూడూరు లో ఉన్న చిన్న పారిశ్రామికవేత్తలు, స్క్రాప్ బిజినెస్ చేసుకునేవాళ్లు, టెంపర్ డిపో వర్కర్స్, ఆటో రిపేర్ షాపులు, లారీ రిపేర్ షాపులు నిర్వాహకులు నిరుపేదలు కావడం వలన తక్కువ ధరలకు ప్లాట్లు కేటాయించాలని సూచించారు.

తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తిడిపై ఉంది

-సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

విశాలాంధ్ర- తిరుమల : తిరుమల పవిత్రతను, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తుడి పై ఉందని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. తిరుపతి - తిరుమల ఘాట్ రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్ల నడక మార్గాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం కోసం శనివారం టీటీడీ నిర్వహించిన సుందర తిరుమల - శుద్ధ తిరుమల కార్యక్రమంలో జస్టిస్ రమణ పాల్గొన్నారు. అలిపిరి టోల్ గేట్ వద్ద ఈవో ఎవి ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకట రమణా రెడ్డి తో కలసి జెండా ఊపి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుమల నుండి తిరుపతికి వచ్చే ఘాట్ రోడ్డు లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జస్టిస్ రమణ పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణ మాట్లాడుతూ, తిరుమల కొండలు పరమ పవిత్రమైనవని చెప్పారు. ఈ ప్రాంతాన్ని ప్రతి ఒక్కరు తమ ఇంట్లో దేవుడి గది లాగే భావించి శుభ్రంగా, పవిత్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుమల ను ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చడానికి టీటీడీ చేస్తున్న కృషిలో ప్రతి భక్తుడు భాగస్వాములు కావాలని కోరారు. 2008లో ఈవో ధర్మారెడ్డి ని తమకు ఇలాంటి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు ఆయన తెలిపారు. భగవంతుడు తనకు ఇన్నాళ్లకు ఆ అవకాశం ఇచ్చారని, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఈవో తనను ఆహ్వానించారని ఆయన తెలిపారు. టీటీడీ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో గొప్పదని, ఇందులో పాల్గొంటున్న ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులను ఆయన అభినందించారు. ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, 25 రోజుల క్రితం 1600 మంది పారిశుధ్య కార్మికులు ముందస్తు సమాచారం లేకుండా సమ్మెలోకి వెళ్లారని చెప్పారు. భక్తులకు ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశంతో తిరుపతి తో పాటు చుట్టుపక్కల ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీ ల నుండి పారిశుధ్య కార్మికులను రప్పించి టీటీడీ అధికారులు ఉద్యోగులు పారిశుధ్య పనులు చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో రెండు ఘాట్ రోడ్లు, నడక మార్గాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేయడానికి శనివారం సామూహిక పారిశుధ్య కార్యక్రమం చేపట్టామని ఆయన చెప్పారు. ఇందులో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పాల్గొన్నారని చెప్పారు. ఇకపై ప్రతినెల రెండో శనివారం సుందర తిరుమల- శుద్ధ తిరుమల కార్యక్రమం నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఆసక్తి ఉన్న అధికారులు, ఉద్యోగులు, భక్తులు, శ్రీవారి సేవకులు స్వచ్ఛందంగా పాల్గొని తిరుమల ను పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా ఉంచడానికి కృషి చేయాలని కోరారు. తిరుమలకు భక్తులెవరు ప్లాస్టిక్ ఉత్పత్తులను తీసుకుని రావద్దని కోరారు. జేఈవో లు సదా భార్గవి, వీర బ్రహ్మం, జాయింట్ కలెక్టర్ బాలాజి, టీటీడీ సివి ఎస్వో నరసింహ కిషోర్ ,జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, ఎస్వీ బీసీ సిఈవో శ్రీ షణ్ముఖ్ కుమార్, స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ సలహాదారు డాక్టర్ జయప్రకాష్ సాయి ,చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, టీటీడీ ఎఫ్ఎ సిఏవో బాలాజి, సి ఎ వో శేష శైలేంద్ర తో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు , స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

సుందర తిరుమల - శుద్ధ తిరుమల కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం

స్వచ్ఛందంగా పాల్గొనడం తిరుమల శ్రీవారి సేవగా అదృష్టంగా భావిస్తున్నాం : కలెక్టర్

విశాలాంధ్ర- తిరుపతి : ఓం నమో వెంకటేశాయ అని స్మరణతో సుందర తిరుమల - శుద్ధ తిరుమల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం సుందర తిరుమల - శుద్ధ తిరుమల కొరకు ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా యంత్రాంగానికి కేటాయించిన నిడివి మేరకు అలిపిరి దగ్గర నుంచి మూడో కిలోమీటర్ దాకా రోడ్ ప్రక్కన అంతా క్లీన్ చేయడానికి జిల్లా యంత్రాంగం తరపున జిల్లా అధికారులతో సహా దాదాపు 100 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు రావడం జరిగిందని తెలిపారు. ఉదయం 6 గంటలకు భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ జస్టిస్ ఎన్వి రమణ, టీటీడీ ఈవో ధర్మారెడ్డి తో కలిసి ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు వచ్చిన అధికారులంతా తమకు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారు వారికి సేవ చేయడానికి వచ్చిన అవకాశంగా భావించి స్వచ్ఛందంగా వచ్చిన వారే అని ఎంతో అంకిత భావంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అని తెలిపారు. ఇక్కడ రహదారి పైన బాగానే ఉంది కానీ దాని ప్రక్కల పారవేసిన ప్లాస్టిక్ కవర్లు బాటిల్స్ తదితర ప్లాస్టిక్ సంబంధిత వస్తువుల చెత్త విరివిగా ఉన్నాయని, వాటిలో నేడు ప్లాస్టిక్ బాటిల్స్ నాన్ డీ గ్రేడబుల్ ప్లాస్టిక్ కవర్స్ తదితర చెత్తను వేరు చేసి సేకరించి వాటిని టిటిడి వారి వాహనాలలో లోడ్ చేయించి పంపడం జరిగిందని అన్నారు. నేడు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఒకవేళ ఈరోజు పూర్తి కాకపోతే, ఎన్నిసార్లు అయినా సరే జిల్లా యంత్రాంగం తమకు ఇచ్చినటువంటి నిడివిని మొత్తం పరిశుభ్రంగా ఉంచడానికి తమ వంతు కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, డీఎస్ఓ సతీష్ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారం లేకున్నా బాసటగా నిలిచిన "పులివర్తి నాని"

విశాలాంధ్ర - చంద్రగిరి: అధికారం లేకున్నా కొత్తశానంబట్లలో అంతుచిక్కని మంటలు కారణంగా నష్టపోయిన బాధితులకు తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ "పులివర్తి నాని" అండగా నిలిచారు. 7 బాధిత కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. విషయం తెలిసిన వెంటనే కొత్తశానంబట్ల గ్రామం చేరుకున్న పులివర్తి నాని బాధిత కుటుంబాల ఇండ్లకు వెళ్లి వారిని పరామర్శించి ఓదార్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మరింత చేయూతనందిస్తానని సబ్సిడీ లోన్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. మిస్టరీ మంటలపై సమగ్ర దర్యాప్తుకు ఎస్పీ, కలెక్టర్ లను కలిసి సమస్యను వివరిస్తామన్నారు. బట్టలు, మంచాలు, బీరువా, నగదు,గడ్డివాములు, వాషింగ్ మిషన్ ఇలా కాలి నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ముందుగా స్పందించిన టీడీపీ ఇన్చార్జ్ "పులివర్తి నాని" కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. తీవ్రంగా నష్టపోయి నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధురాలు మునిలక్ష్మికి 5000 రూపాయలు నగదు తో పాటు మంచం పరుపు అందించటంతో మునిలక్ష్మి కళ్ళల్లో ఆనందం తొణికిసలాడింది.

సిబిఎస్ఈ పది ఫలితాల్లోచిన్మయా విద్యాలయ విజయకేతనం

విశాలాంధ్ర- సత్యవేడు: శుక్రవారం వెలువడిన సిబిఎస్ఈపదవ తరగతి ఫలితాల్లోశ్రీసిటీ చిన్మయావి ద్యాలయసిబిఎస్ఈ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ పాఠశాల నుంచి 39 మందివిద్యార్థులు పది పరీక్షలకు హాజరై అందరూ పాసైనట్లు చిన్మయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.భువనేశ్వరి తెలిపారు. 22 మంది డిస్టింగ్షన్, పదిమంది ఫస్ట్ క్లాస్, ఏడుగురు సెకండ్ క్లాస్ సాధించారన్నారు. వీరిలోవి.కేశవ్95.2 శాతం (476/500), ఎం.ఎం.సోహన్‌కృష్ణ 94 శాతం (470/500), ఎన్.జి.దేవాజ్ ప్రభాకర్ 91.8 శాతం(459/ 500),ఎం. చరణ్‌తేజ91.6శాతం(458/500), ఎస్.పార్థసారథిగౌడ్90 శాతం(450/500)అత్యుత్తమ మార్కులు సాధించి స్కూల్ టాపర్లుగా నిలిచారని ఆమె తెలిపారు.కాగా పాఠశాలకు సంబంధించి పదవతరగతి పరీక్షలకు ఇది ఆరవ బ్యాచ్ కాగా,వరుసగా ఆరేళ్ళు వందశాతం ఫలితాలు సాధించడం విశేషం.మంచి ఫలితాలు సాదించినందుకు విద్యార్థులు,ప్రిన్సిపాల్, టీచర్లకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

గూడూరులో కాంగ్రెస్ పార్టీ సంబరాలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పరిమళ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కర్నాటకలో ఆ పార్టీ ఘన విజయం పట్ల సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో విజయం సాధించినందున గూడూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తలతో స్వీట్స్ పంచి, బాణాసంచాలతో, జై కాంగ్రెస్ నినాదాలతో సంబరాలు చేసుకున్నామని తెలిపారు. మతోన్మాదానికి లౌకికవాదానికి నడుమ జరిగిన పోరుగా ఆయన అభివర్ణించారు. అనంతరం బాణా సంచి కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మెదూరు శ్రీనివాసాచారి, గూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు మాదాల రమాదేవి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కలిమేలి పవన్ కుమార్, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు సొలోమోను రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అహ్మద్ భాష, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సీనియర్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్రను జయప్రదం చేయండి

- టీడీపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే పిలుపు

విశాలాంధ్ర - గూడూరు : నారా లోకేష్ సంఘీభావ పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గమళ్లపాలెం టీడీపీ నియోజకవర్గ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువ నాయకులు, మాజీ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర ఈ నెల 15వ తేదీకి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా సంఘీభావ పాద యాత్ర సోమవారం ఉదయం ఏడు గంటలకు గూడూరు కోర్టు సెంటర్ నుండి చెన్నూరు వరకు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. టిడిపి కార్యకర్తలు, అభిమానులు సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు యువ నాయకులు మాజీ మంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తున్నారని, ఈ నెల 15వ తేదీకి వంద రోజులు పూర్తవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం గూడూరు కోర్టు సెంటర్ నుండి చెన్నూరు బస్టాండ్ వరకు సంఘీభావ పాదయాత్ర 3,000 మందితో నిర్వహిస్తున్నామని పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం

విశాలాంధ్ర - గూడూరు : రాజీ మార్గమే రాజమార్గమని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని కోర్టు హాల్లో జాతీయ మెగా లోక్ అదాలత్ ను ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం, సబ్ జడ్జిల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలికేసులను కక్షిదారులతో మాట్లాడి కొట్టివేశారు.జాతీయ మెగా లోక్ అదాలత్ ను గూడూరు కోర్టులో ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం నిర్వహించారు. రాజీ అయ్యే కేసులను కక్షిదారులతో మాట్లాడి వారి అంగీకారంతో కేసులను కొట్టివేశారు. జిల్లా జడ్జి సుల్తానా బేగం మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలకు కేసులు పెట్టుకుని సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిరుగుతూ డబ్బును, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. లోక్ అదాలత్ ల ద్వారా కేసులు రాజా చేసుకుని ప్రశాంతంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్లు లాయర్లు పోలీసు అధికారులు కక్షిదారులు పాల్గొన్నారు.

టీటీడీ సామూహిక శ్రమదానం విజయవంతం

- రెండు ఘాట్ రోడ్లు, నడకదారులలో 1590 బ్యాగుల వ్యర్థాల తొలగింపు

- పాల్గొన్న సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ, టిటిడి ఈవో, కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర - తిరుమల :తిరుమల ఘాట్ రోడ్లు, నడకదారుల్లో శనివారం ఉదయం టిటిడి చేపట్టిన సామూహిక శ్రమదాన కార్యక్రమం విజయవంతమైంది. ముందుగా ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద ప్రముఖులు, అధికారులు, ఉద్యోగులు సమావేశమయ్యారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 700 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు సెక్టార్ల వారీగా తమకు కేటాయించిన ప్రదేశాల్లో శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు.- 1590 బ్యాగుల వ్యర్థాల తొలగింపు : టీటీడీ తలపెట్టిన సామూహిక శ్రమదానం కార్యక్రమంలో రెండు ఘాట్ రోడ్లు, నడక మార్గాలలో 1590 బ్యాగులకు వ్యర్థాలను నింపి తొలగించారు. అందులో మొదటి ఘాట్ రోడ్ లో 582 బ్యాగులు, రెండవ ఘాట్ రోడ్ లో 686 బ్యాగులు, అలిపిరి నడక మార్గం లో 296 బ్యాగులు, శ్రీవారి మెట్టు నడక మార్గంలో 66 బ్యాగులకు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను నింపి తొలగించారు.సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి డౌన్ ఘాట్ రోడ్డులోని ఏడో మైలు ఆంజనేయస్వామివారి ఆలయం నుండ కొంతదూరం శ్రమదానం చేశారు. జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అలిపిరి టోల్‌గేట్ వద్ద శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రమదానం కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేసి నిరంతరం కొనసాగించాలని కోరారు. వంద మంది రెవెన్యూ సిబ్బందితో అలిపిరి టోల్ గేట్ నుండి రోడ్డుకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర వ్యర్థాలను తొలగించినట్లు తెలిపారు.స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సలహాదారు డా. జయప్రకాష్ సాయి అలిపిరి మార్గంలో 15వ కి.మీ నుండి 12వ కి.మీ వరకు శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల ఘాట్ రోడ్లలో శ్రమదానం కార్యక్రమం బృహత్తరమైనదన్నారు. రెండు ఘాట్ రోడ్లు, నడకదారుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయకుండా భక్తుల్లో అవగాహన పెంచాలని సూచించారు. పర్యావరణహితం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులను కూడా భాగస్వాములను చేయాలన్నారు.అదేవిధంగా, జెఈవో సదా భార్గవి డౌన్ ఘాట్ రోడ్డులో, జెఈవో వీరబ్రహ్మం అప్ ఘాట్ రోడ్డులో మున్సిపల్ కమిషనర్ హరిత, వారి సిబ్బంది మోకాలిమెట్టు వద్ద, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, సివిఎస్వో నరసింహ కిశోర్, వారి సిబ్బంది అలిపిరి నడకమార్గం వద్ద, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ్ కుమార్ శ్రీవారిమెట్టు మార్గంలో శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి న్యాయాధికారి వీర్రాజు, ఎఫ్ఏసిఏఓ బాలాజి, సిఈ నాగేశ్వరరావు, సిఏఓ శేషశైలేంద్ర ఇతర విభాగాధిపతులు, టిటిడి ఉద్యోగులతో పాటు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ సిబ్బంది, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా మహాశాంతి తిరుమంజనం

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి కపిలతీర్థంలో గల పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం శాస్త్రోక్తంగా మహాశాంతి తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం యాగశాల వైదిక కార్యక్రమాలు, అక్షిణ్మోచనం, పంచగవ్యాధివాసం, క్షీరాదివాసం, జలాధివాసం, రత్నన్యాసం, బింబస్థాపన, అష్టబంధన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం బింబవాస్తు, నవ కలశ చతుర్దశ కలశ స్నపనం, మహాశాంతి, తిరుమంజనం, పూర్ణాహుతి, శయనాధివాసం నిర్వహించారు.మే 14న ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మిథున లగ్నంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు. ఆ తర్వాత భక్తులకు సర్వదర్శనం ప్రారంభమవుతుంది.ఈ కార్యక్రమంలో టీటీడీ వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, డెప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

రక్తహీనతను కూరగాలయతో నివారించ వచ్చు

విశాలాంధ్ర - కార్వేటినగరం: విద్యార్థుల్లో ప్రధానంగా నెలకొనే రక్తహీనతను సాధారణంగా అందుబాటులో ఉండే కూరగాయాలతో నివారించవచ్చని సైన్సు ఉపాధ్యాయుడు మునిరాజ అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణలో భాగంగా శనివారం రక్తహీనతను నిర్మూలించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందుబాటులో ఉంటూ అతి తక్కువ ధరలకే లభించే ఆకు కూరలను వాడకం వల్ల రక్తహీనతతో పాటు, అనేక రోగాలకు చెక్కపెట్టవచ్చని సూచించారు. అలాగే సూర్యరస్మివల్ల కలిగే ప్రయోజనాలను కూడా విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రందాలయ అధికారి. శంకరాబు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

మిస్టరీ మంటల బాధితులకు అండగా మోహిత్ రెడ్డి

తక్షణ సాయంగా ప్రతి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం, కొత్త శానంబట్లలో జరిగే వరుస అగ్నిప్రమాదాల వెనుక దాగిన రహస్యాన్ని చేదించాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. మంటలతో నష్టపోయిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఏం జరిగిందో వాస్తవాలను వెలికి తీసేందుకు పోలీసులు వచ్చారని భయపడాల్సిన అవసరం లేదని గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. మంటల్లో బట్టలు, ధాన్యం, ధనం కోల్పోయిన బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం చేసి తన ఔదార్యం చాటుకున్నారు. గ్రామంలో శాంతి పూజలకు మోహిత్ రెడ్డి చేయూతనిస్తామన్నారు. కొత్త శానంబట్లలో జరిగే ఆకస్మిక మంటలను అదుపు చేయడానికి ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి ఇంటిలో వైరింగ్ తనిఖీ చేయాలని విద్యుత్ అధికా రులకు సూచనలు చేశారు. పరిస్థితి సద్దుమణిగేంతవరకు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని డి.ఎస్.పి యశ్వంత్ ను ఆదేశించారు. డియస్పి యశ్వంత్ ఆగమేఘాలపై క్లూస్ టీం ను రంగంలోకి దించారు. గ్రామస్తులు కోరిక మేరకు గ్రామ దేవతలకు శాంతి పూజలు చేయిం చడానికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేయూతనిస్తామన్నారు. గ్రామ పెద్దలు సమక్షంలో గ్రామంలో శాంతి నెలకొల్పడానికి తాను ఏమి చేయమన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అంతకు ముందు చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్ ముదుపల్లి సురేష్ రెడ్డి, శంకర్ యాదవ్ లతో పాటు అధికారులు అందరినీ వెంట బెట్టుకుని గ్రామంలో పర్యటిస్తూ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా చెప్పారు.

ఆలయానికి సీతారాముల ఉత్సవ విగ్రహాలు వితరణ

విశాలాంధ్ర పులిచెర్ల-కల్లూరు:- పులిచెర్ల మండలం చల్లా వారి పల్లె శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయానికి శనివారం దాతలుసీతారాముల విగ్రహాలను వితరణగా అందజేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు యుగంధర్ తెలిపారు ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రధాన అర్చకులు వాసుదేవ శర్మ పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

బిజెపితో ఎందుకు పొత్తు పెట్టుకుంటున్నారో
రాష్ట్ర ప్రజలకు పవన్ కళ్యాణ్ స్పష్టత ఇవ్వాలి

కర్ణాటక ఫలితాలతో బిజెపి పతనం ప్రారంభం: సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు

విశాలాంధ్ర -చిత్తూరు : ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రాష్ట్రానికి రావాల్సిన నిధులు కేటాయింపులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, అలాంటి బిజెపితో రాష్ట్రంలో ఎన్నికల పొత్తు పెట్టుకుంటామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పడం సిగ్గుచేటు అన్నారు. శనివారం చిత్తూరు నగర సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎస్ టి యు కార్యాలయంలో గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏ.రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇచ్చిందని, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించిందని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసిందని ,బిజెపితో పొత్తు పెట్టుకుంటున్నావా అంటూ పవన్ పై ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం చేస్తున్నందుకు బిజెపితో పొత్తు పెట్టుకున్నట్లు చెప్పగలరా అని ప్రశ్నించారు. వంట గ్యాస్ ధర ని 1200 రూపాయలు, పెట్రోల్ డీజిల్ ధరలు 100 రూపాయలు, కరెంట్ చార్జీలు పెంచినందుకు బిజెపితో పొత్తు పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. దక్షిణాది రాష్ట్రాలలో అధికార, ప్రతిపక్ష పార్టీలలో చిచ్చుపెట్టి ఎలాగైనా తమ పాగా వేయాలని ప్రయత్నిస్తున్న బిజెపితో కలిసి ప్రయాణం చేస్తాడో సమాధానం చెప్పాలన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపి ని రాష్ట్రంలో దేశంలో ఎండగట్టేందుకు లౌకిక పార్టీలు ఏకతాటిపైకి రావాలని కోరారు. కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఫలితాలు నరేంద్ర మోడీ పథకానికి నాంది పలికాయని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మరిన్ని రాష్ట్రాల ఎన్నికల లో బిజెపి అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని చెప్పారు. సమావేశంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు, సిపిఐ నగర గోపీనాథ్ నాయకులు మణి, సత్యమూర్తి, రఘు, జయలక్ష్మి, విజయ గౌరీ, జమిలాబి, రమాదేవి, కుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర - గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వివిధ పాఠశా లలకు చెందిన చిన్నారులకుబహుమతులు అందజేశారు. శనివారం ఎక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో పుస్తకాలు, ప్రశంసా పత్రాలు సంస్థ నిర్వాహకులు తులసీనాదం నాయుడు అందజేశారు.వేసవి తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మనోవుల్లాసం కాగుతోందన్నారు. కార్యక్రమంలో పుష్ప, భాస్కర్, రచంద్ర మూర్తి పాల్గొన్నారు.

శస్త్ర చికిత్స శిబిరానికి అనూహ్యస్పందన

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి :బైరెడ్డిపల్లె జడ్ పి హైస్కూల్ నందు శనివారం చెన్నై శంకర్ నేత్రాలయ మరియు సాయిమాత సేవాట్రస్టు వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిభిరం జరపడమైనది.ఈ చికిత్సా శిభిరం నకు మండలం లోని ప్రజలు 75 మంది హాజరయినారు.

గంగమ్మ గుడి వద్ద అన్నదాన కార్యక్రమం

పలమనేరు విశాలాంధ్ర: శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన మారెమ్మ ఆలయం గంగమ్మ ఆలయం కమ్మ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యం లోప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.గంగమ్మ జాతరలో ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలన్నారు. అలాంటి అమ్మవారి జాతరనుఅత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఇందుకు కుల మత విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కన్నయ్య నాయుడు, బాబు నాయుడు, చంగల్ రాయినాయుడు, జగదీష్ నాయుడు,మండి సుధాకర్ నాయుడు, దామోదరం నాయుడు, దేవేంద్ర, రామకృష్ణ, అమర, శేషగిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.త ప్రయాణం ,బోజనం,వసతి,మందులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో శంకర నేత్రాలయ సిబ్బంది,మురళి క్రిష్ణ,డా, శ్రీనివాసులు,చంద్ర,చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నేతగుంటపల్లె రిజర్వాయర్ పరిశీలన

గ్రీన్ ట్రిబునల్ తీర్పును లెక్క చేయని పి ఎల్ ఆర్ కంపెనీ రామచంద్ర యాదవ్ ఆరోపణ!
రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్!

విశాలాంధ్ర - పుంగనూరు: -ప్రముఖ వ్యాపారవేత్త రాష్ట్ర యువ నాయకులు బడుగు బలహీన వర్గాల నేత బోడే రామచంద్ర యాదవ్ శనివారం రోజున మండలంలోని నేతిగుంటపల్లె గ్రామ సమీపాన రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం చేపడుతున్న రిజర్వాయను పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రౌడీయిజం గూడాయిజం దుర్మార్గాలు చేయడంతో పాటు ప్రజల సొమ్మును దోచుకోవడం దాచుకోవడం అనే నినాదంతో ముందుకు వెళ్లడం జరుగుతున్నది అన్నారు అందులో భాగంగా ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లా లో పుంగనూరు నియోజకవర్గంలో రెండు రిజర్వాయర్లను అన్నమయ్య జిల్లా తన తమ్ముడు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి శాసనసభ్యులుగా ఉన్న తంబాలపల్లె నియోజకవర్గం ముదివేడు గ్రామ సమీపాన ఇంకొక రిజర్వాయర్ ను ఏర్పాటుకు ముందుకు వచ్చిరాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజల సొమ్మును వేల కోట్ల రూపాయలను దోచుకోవడానికి ఈ ప్రాజెక్టు నిర్మాణాలు చేపడుతున్నారు అన్నారు మంత్రికి సంబంధించిన పిఎల్ఆర్ కంపెనీ నేషనల్ గ్రీన్ ట్రిబునల్ అనుమతులకు తప్పుడు సమాచారం ఇవ్వడం జరిగింది అని ఈ ప్రాజెక్టు పనులు వెంటనే ఆపాలని నేషనల్ ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి 100 కోట్లు జరిమానా విధించడం జరిగిందన్నారు అయినను ఎలాంటి భయం లేకుండా తీర్పును గౌరవించకుండా దౌర్జన్యంతో పి ఎల్ ఆర్ కంపెనీ ప్రాజెక్టు పనులను చేస్తుందన్నారు దాదాపు ప్రాజెక్టు పనులు పూర్తి కావస్తున్న భూమి కోల్పోయిన రైతులకు ఏ ఒక్కరికి పరిహారం ఇవ్వలేదన్నారు పరిహారం అడిగిన రైతులపై దౌర్జన్యం చేయడం వారి పైన అక్రమ కేసులు పెట్టడం చేస్తున్నారన్నారు ఉన్నత స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి పెట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు రాజ్యాంగ పరిధిలో ఉన్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేషనల్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పును గౌరవించి ఈ పనులు ఆపి భూములు కోల్పోయిన రైతన్నలకు నష్టపరిహారం చెల్లించాలని సూచించడం జరిగింది నియోజవర్గంలో రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజలు గుణపాఠం చెప్పడం జరుగుతుందని తెలియజేశారు రైతులకు న్యాయం జరిగేంత వరకు న్యాయపోరాటం చేస్తూనే ఉంటానని రైతులకు హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కు భూములు కోల్పోయిన రైతులు ఆర్ సి వై టీం సభ్యులు సాంబమూర్తి ఆనంద నగేష్ అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ విజయంపై సంబరాలు

విశాలాంధ్ర - కార్వేటినగరం: భారత దేశంలో అతి పెద్ద పార్టీగా చెప్పుకుంటున్న భారతీయ జనతా పార్టీపై కర్ణాటక రాష్ట్రంలో శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం : సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్వేటినగరం గాండ్ల మిట్ట కూడలిలో బాణసంచాలు పేల్చి, మితాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గోవర్ధన్రెడ్డి మాట్లాడుతూ బీజేపీ మోసపూర్తి హామీలను కర్ణాటక ప్రజలు నమ్మలేదని, ఇలాగే ప్రతి రాష్ట్రంలోను మోదీకి ఎదురు దెబ్బ తప్పని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దినకర్ ప్రసాద్,జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గౌతం, కోఆర్డినేటర్ సుబ్బరాయులు, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు గోసే భాషా పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విరుపాక్షమ్మ జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర -పులిచెర్ల -కల్లూరు:- పులిచెర్ల మండలం కల్లూరు గ్రామ దేవత విరుపాక్షమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

గంగమ్మ తల్లికి సారె సమర్పించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. నారాయణస్వామి పేర్కొన్నారు.శనివారం ఉదయం తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లికి గంగ జాతర సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. నారాయణస్వామి అమ్మవారికి సారె సమర్పించారు, గంగమ్మ ఆలయం చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి,నగర మేయర్ డాక్టర్ శిరీష,ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు, అనంతరం అమ్మవారికి సారె సమర్పించి అమ్మవారి కి ప్రత్యక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి ఆలయం నందు మీడియాతో మాట్లాడుతూ గంగమ్మ ఆలయ దిన దిన అభివృద్ధి చేయడమే కాకుండా తిరుపతి గంగమ్మ ఆలయానికి జాతీయ హెూదాగా తీసుకొచ్చి చరిత్ర సృష్టించిన ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి గారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానుని, దీనికి అన్ని రకాలుగా తోడ్పాటు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయ విశిష్టతను ఎవ్వరు కూడా తీసుకురాలేదని, ఎమ్మెల్యే చొరవ తీసుకొని గంగమ్మ తల్లి చరిత్రను తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలకే కాకుండా యావత్ భారతదేశంలో తిరుపతి గంగమ్మ ఆలయానికి గుర్తింపు తీసుకురావడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలను గంగమ్మ తల్లి చల్లగా చూడాలని, అదేవిధంగా కరుణాకర్ రెడ్డిని, రాష్ట్ర ముఖ్యమంత్రికి శ్రీ గంగమ్మ తల్లి కృప కటాక్షాలు నిండుగా ఉండాలని కోరుకోవడం జరిగిందని తెలిపారు. అమ్మవారికి సారి సమర్పించి దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గోపి యాదవ్ ఈవో ముని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో ప్రజాస్వామ్యం ఉందా? పోలీస్ చట్టం ఉందా?

పుంగనూరులో న్యాయం ఎక్కడ?: సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు

విశాలాంధ్ర - పుంగనూరు:- పుంగనూరు నియోజకవర్గం, పుంగనూరు లో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ చేతగాని విధానాలను, ప్రజలకు నష్టం కలిగే విధానాలను, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే ,అధికార పార్టీకి సంబంధించిన వైయస్సార్ సిపి పార్టీ నాయకులు ప్రశ్నించే వారిపై దాడులు చేయడాన్నీ తీవ్రంగా ఖండించారు. ప్రతి పక్ష పార్టీ నాయకులపై ఎన్ని దాడులు జరిగిన పోలీసు చట్టం ఉన్నప్పటికీ పుంగనూరులో పోలీసులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు పుంగనూరు మండలం ,మంగళం పంచాయతీ, కంగానెల్లురూ గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ గారి తమాలపాకుల తోటను నిన్నటి రోజున అర్ధరాత్రి వేళ తోటను మొత్తాన్ని ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు కనిపెట్టి మనసుల పైన దాడులు చేయడం కాకుండా తమలపాకు తోటలో పైన కూడా దాడులు చేసిన దుండగులపై కటిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఆకు తోట పై ఆధారపడి జీవిస్తున్న కిరణ్ కుమార్ ను నష్ట పరచడం శోచనీయమన్నారు .నష్టం చేసిన వారు ఎంతటి వారైనా వారిని పుంగనూరు పోలీసులు గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొని కిరణ్ కుమార్ గారికి న్యాయం చేయాలని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల్ మెజిస్ట్రేట్ అయిన మండల తాసిల్దార్ గారు జోక్యం చేసుకొని నిజ నిజాలు తెలుసుకొని న్యాయం చేయాలని ఇలాంటి సంఘటనలు పునర్వతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అలరించిన ఆర్.కె అబాకస్ విద్యార్థుల వేషధారణ

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీ తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర మహెూత్సవాల్లో భాగంగా శనివారం నాడు ఆర్.కె.అబాకస్ విద్యార్థులు వేసిన వేషధారణలు అలరించాయి. ఆర్.కె అబాకస్ విద్యార్థులు విద్యార్థులు కె.యశ్వంత్‌రెడ్డి, గురు చరణ్, శిఖర్ స్వరాజ్, కె.దిలీప్‌కుమార్ రెడ్డి లు శ్రీనరసింహస్వామి, శివుడు, శ్రీకృష్ణ, నారద, భీముడు, బ్రహ్మ వేషాలు ధరించి శ్రీ గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కె.అబాకస్ డైరెక్టర్ రామ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర మహెూత్సవాల్లో భాగంగా విద్యార్థులు వివిధ వేషధారణలు ధరించి, గంగమ్మతల్లిని దర్శించుకొని, అమ్మవారి ఆశీస్సులు పొందారన్నారు. గంగమ్మ తల్లి అనుగ్రహంతో విద్యార్థులు చదువులో బాగా రాణించాలని కోరుకున్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచెనుపల్లి,టి వేణుగోపాల పురం,సింగపూరిండ్లు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రవర్మ షోకాజ్ నోటీసులు అందించారు.కొన్ని పాఠశాల లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి విద్యా వాలంటీర్ లను నియమించుకుని విద్యార్థులకు పాఠాలు చెప్పించేవారు.ఇదే విషయమై ఫిబ్రవరి 15 న "విద్యా వ్యవస్థకు దిక్కెవరు" అన్న శీర్షిక న విశాలాంధ్ర లో వార్త ప్రచురించిన విషయం విదితమే. ఇదే విషయమై ఫిబ్రవరి16 న జిల్లా విద్యాశాఖ అధికారి సంబంధిత పాఠశాలలు పరిశీలించారు. ఈ క్రమంలో 8 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు మీడియా కు చెప్పారు.విచారణ నివేదికల అనంతరం ఏట్టికేలకు మే 12న ముగ్గురు ఉపాధ్యాయులకు మాత్రం షోకాజ్ నోటీసులు ఇచ్చారు.నిర్దేశించిన గడువు లోపు వివరణ ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది.

తమలపాకుల తోట ధ్వంసం చేయడం ఏయమైనా చర్య

ధ్వంసమైన తమలపాకుల తోట పరిశీలించిన రామచంద్ర యాదవ్!
రైతుకు ఆర్థిక సాయం అందజేత!

విశాలాంధ్ర - పుంగనూరు: మండలంలోని మంగళం పంచాయతీ పరిధిలో ఉన్న కంగా నెల్లూరు గ్రామానికి చెందిన రైతు ఎస్ శ్రీనివాసులు కు చెందిన తమలపాకుల తోటను శుక్రవారం రోజు రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడం జరిగింది ఈ తోటను శనివారం రోజున వ్యాపారవేత్త రాష్ట్ర యువ నాయకులు బి రామచంద్ర యాదవ్ పరిశీలించి రైతును పరామర్శించి జరిగిన నష్టానికి 50 వేలు ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా తమలపాకుల తోట రైతు శ్రీనివాసులు కుమారుడు కిరణ్ మాట్లాడుతూ నాకు ఏ పార్టీతో గాని ఏ రాజకీయ నాయకులతో గానీ ప్రసంబంధ లేవని తెలియజేస్తున్నానన్నారు మేము ఒక బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద రైతు అని మాకు ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నామన్నారు దాదాపు తొమ్మిది నెలల కాలం నుండి 2 లక్షల రూపాయలు వెచ్చించి తమలపాకుల తోటను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు గత ఐదు సంవత్సరాలు కాలంగా వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ వెంట ఉండడం జరిగిందని అంతేగాక రామచంద్ర యాదవ్ మా గ్రామానికి వచ్చినప్పుడు మా ఇంటికి ఆయన ఆహ్వానించడం జరిగిందని కొంతమంది కక్షపూరితంగా గుర్తు తెలియని దుండగులు ఈ అగత్యానికి పాల్పడి మా తోటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు తమలపాకుల తోట అంటే లక్ష్మీదేవితో సమానమని ప్రతి ఒక్కరూ భావిస్తారని కానీ ఇలాంటి తోటపై ఇలాంటి పని చేయడం చాలా బాధగా ఉందన్నారు జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దౌర్జన్యాలు అక్రమ కేసులు రైతులపై విచ్చలవిడిగా స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు పోలీసులు ఫిర్యాదు చేసినప్పటికీ ఏ ఒక్కరిపై కేసులు నమోదు చేసుకోవడం వలన వైసీపీ నేతలు ఇష్టానుసారంగా ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు నా అనుచరులుగా ఉన్న కిరణ్ తోటపై దుర్మార్గంగా ఇలా చేయడం ఏమైనా చర్య అని పేర్కొన్నారు ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దుర్మార్గులను అరెస్టు చేయాలని కోరుతున్నామన్నారు రైతుకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సాంబమూర్తి నగేష్ ఆనంద అనిల్ కుమార్ రెడ్డి వెంకటేష్ పలు రైతులు పాల్గొన్నారు.

కనువిందుగా సంతాన వేణుగోపాలుని ధ్వజారోహణం

-అట్టహాసంగా ప్రారంభమైన వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు
- పెద్ద శేష వాహనంపై విహరించిన వేణుగోపాలుడు

విశాలాంధ్ర - కార్వేటినగరం: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వేడుకగా ధ్వజారోహణం జరిగింది. ఉదయం ఐదు గంటలకు స్వామివారినిసుప్రభాత సేవతో మేల్కొపి శు ద్ధి,తోమాల,పంచాంగ్రవణం, అర్చన,నిత్యకైంకర్యాలు, అభిషేకం, పుణ్యాహవచనాలతో ప్రారంభించారు. తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. 6 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడుతో కలసి మాడవీధులలో ఊరేగింపునకు బయలుదేరారు. లోకకళ్యాణంకోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి విశ్వక్సేనుడు అష్ట దిక్పాలకులను ఆహ్వానించి ఆలయ మాఢవీదులలో నిర్వహించే కార్యక్రమాన్ని కంకణ భట్టాచార్యులు గోపాలచారి. చేపట్టారు. అనంతరం 11 గంటల నుంచి 11.30 గంటల మధ్య కర్కాటక లగ్నంలో వేదమంత్రాలు, మంగళవా యిద్యాలు నడుమ గరుదాల్వార్ చిత్రపటమున్న వస్త్రంతో పాటు పూలమాలలను జోడించి ఆలయంలోని ధ్వజస్థంభానికి అధిరోహించారు.సాయంత్రం 5.30 నుంచి 6 గంటలకు మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలుడిని పట్టు వస్త్ర సుగంధభరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై వేంచేసి ఆలయ ఆవరణంలోని ఊంజల్ మండపానికి చేరుకొని కనుల పండువగా ఊంజల్ సేవ నిర్వహించారు.-అలరించిన సంగీత కచ్చేరి.టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ వారు నిర్వహించిన సంగీత కచ్చేరి. భక్తులను ఎంతగానో ఆకట్టుకొంది. స్వామివారికి వివిధ రకాలైన భక్తి గీతాలను ఆలపించి స్వామివారిని పర్వసింప చేశారు.-పెద్దశేషవాహనంపై వేణుగోపాలుడు విహారం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు శనివారం రాత్రి ఉభయ నాంచారులతో పాటు శ్రీవేణుగోపాలుడు పెద్దశేషవాహనం పై చెక్కభజనలు, బాజా భజింత్రీల మధ్య పురవీధ ులలో ఊరేగారు. కోలాటాలు, భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం 9.45 గంటలకు వేదపండితులు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న,ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆలయఅదికారి సురేష్ కుమార్,నాగ రాజు,కంకణభట్టు,నారాయణదాసరి, కిరణ్ భట్టార్యులు, సుందరవరదాచార్యులు పలువురు వేదపండితులు టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.- నేడు చిన్నశేష వాహన సేవలు..నేడు ఆదివారం ఉదయం స్వామివారు ఉభయ దేవేరులతో పాటు చిన్నశేష వాహనంపై పురవీధుల్లో ఊరేగ నున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. అలాగే నిత్యకైంకర్యాలు నిర్వహించి రాత్రికి హంసవాహనంపై స్వామివారు విహరించనున్నట్లు వారు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సత్వర న్యాయం కోసమే లోక్అదాలత్ : జిల్లా అదనపు జడ్జి

విశాలాంధ్ర - చిత్తూరు : సమన్యాయం, సత్వర న్యాయం, పేదలకు ఉచితంగా న్యాయం అందిం చడమే లోక్ అదాలత్ ఉద్దేశ్యం అని చిత్తూరు జిల్లా మొదటి అద నపు జిల్లా కోర్ట్ న్యాయమూర్తి ఎస్.రమేష్ తెలిపారు. శనివారం చిత్తూరు నూతన కోర్ట్ భవనం నందు మెగా జాతీయ లోక్ అదాలత్ కార్య క్రమం జరిగింది .ఈ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్ట్ న్యాయమూర్తి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన లోక్ అదాలత్ ల ద్వారా కేసుల పరిష్కా రించడం లో జిల్లా కు మంచి పేరు ఉందని, 2 వ విడత కార్యక్రమంలో కూడా అదే విధంగా కేసులు పరిష్కరించి జిల్లాకు మంచి ప్రతిష్టను సంపాదించేందుకు కృషి చేయాలని రెవి న్యూ, పోలీసు, న్యాయవాదులను కోరారు.లోక్ అదాలత్ ల ద్వారా సత్వర న్యాయం జరుగు తుందన్న విషయాన్ని కక్షిదారులు గుర్తించాలని, ఆర్థిక ఇబ్బందులతో న్యాయవాదులను సమకూర్చుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ల ద్వారా వచ్చిన తీర్పుకు అప్పీలు ఉండదని, ఇరు కక్షిదారులకు సమన్యాయం సకాలంలో అందించడం జరుగుతుందని, లోక్ అధాలత్ ను వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఐ. కరుణ కుమార్ మాట్లాడుతూ కక్షిదారులు సత్వరన్యాయాన్ని పొందడం తమకున్న ప్రాథమిక హక్కుగా సుప్రీం కోర్ట్ పరిగణించిందని, ఇందులో భాగంగా లోక్ అదాలత్ కార్యక్రమం రూపుదిద్దుకుందని, దీని ద్వారా అనేక కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునే అవకాశం కల్పించించారని తెలిపారు. జిల్లా కోర్ట్ మరియు 13 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలలో 2 వ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందనితెలిపారు. కక్షిదారులు కక్షలు, కార్పణ్యాలు విడిచిపెట్టాలని తెలిపారు. గతంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపి నందుకు సంబంధిత శాఖల అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టడానికి అవసరమైన అవగాహన కార్యక్రమాల కొరకు స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చిత్తూరు ఆర్ డి ఓ రేణుక మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జె సి సూచనల మేరకు మండలాల్లో గల కేసుల వివరాలను తహశీల్దార్ల ద్వారా తెలుసుకుని కక్షిదారులు సంతృప్తి చెందేలా వారిని లోక్ అదాలత్ తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కక్షిదారులు చిన్న విషయాలకు పట్టుదలకు పోకుండా ఆలోచించి ఒప్పందానికి వస్తే కేసులు పరిష్కారం అవుతా యని, ప్రశాంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు.చిత్తూరు డి ఎస్ పి శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ క్షణికావేశం లో పెట్టిన కేసులను కక్షిదారుల పరస్పర అంగీకారంతో వారికి సత్వర న్యాయం అందించడం లో లోక్ అదాలత్ తోడ్పడు తుందని తెలిపారు. స్నేహపూర్వక భావంతో కక్షిదారులు ఉన్నప్పుడు న్యాయస్థానాలు, న్యాయవాదుల సహకారంతో కేసులు పరిష్కరించబడు తుందని తెలిపారు. లోక్అదాలత్ ఒక వరం లాంటిదని తెలిపారు. గ్రామాలలో సైతం ప్రజలకు సైబర్ నేరాల పైఅవగాహన కార్యక్రమాలను పోలీస్ శాఖ నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.ఇందులో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసు ల లోక్ అదాలత్ ప్రదర్శన, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ లోక్ అదాలత్ లోన్యాయమూ ర్తులు,న్యాయవాదులు,కక్ష దారులు, వివిధ సంబంధింత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు మహిళ బలి

మిద్దె పైనుంచి కిందకు తోసి హతమార్చారు - కుటుంబ సభ్యుల ఆరోపణ

విశాలంగా -చిత్తూరు : అత్తింటి వారి వేధింపులకు ఓ మహిళ బలైంది. కోడలని కూడా చూడకు ండా మహిళను మిద్దె పైనుంచి కిందకు తోసివేసి అత్తింటి వారు హత్య చేశారంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చిత్తూరు నగరంలోని ఎస్టేట్లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా కోడుమూరు గ్రామానికి చెందిన బజారప్ప , పార్వతమ్మల కుమార్తె శాంతిని 12 ఏళ్ల క్రితం చిత్తూరు నగరం ఎస్టేట్లో నివాసం ఉంటున్న వీరన్న , పుష్పలతల కుమారుడు నాగరాజుకి ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సందర్భంగా రెండు లక్షల నగదు 10 సవరణల బంగారు ఇతర సాంప్రదాయాలను పూర్తి చేసి పెళ్లి ఘనంగా చేశారు. పెళ్లయిన కొంతకాలం నుంచే అత్తింటి వారు మరింత కట్నం కావాలంటూ వేధించే వారని కుమార్తె శాంతి తల్లికి చెబుతుండేది. వీరికి హేమంత్ అనే తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నారు. నాగరాజు బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తుండగా భార్యకు నయా పైసా కూడా ఇవ్వకపోవడంతో చిత్తూరులోనే శాంతి ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్ గా పని చేస్తుండేది. అత్తింటి వారి వేధింపులు ఉన్నప్పటికీ శాంతి తన కుమారుడు కోసం జీవనం సాగిస్తుండేది. అయినప్పటికీ అత్తమామల వేధింపులు తరచూ ఉండేవి. భర్త ఇంటికి వచ్చినప్పుడల్లా సూటిపోటీ మాటలతో భార్యను వేధిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో శాంతి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తనను నానా మాటలతో చంపేస్తున్నారని , తనను చంపడానికి సైతం తన అత్త ,మామ , భర్త వెనుకంజ వేయరని ఏడుస్తూ చెప్పింది. కుటుంబ సభ్యులు సర్దుకుపో అంటూ నచ్చ చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో నాగరాజు శాంతి ఇంటి మిద్దె పైనుంచి దూకేసిందని కుటుంబ సభ్యులకి ఫోన్ చేసి తెలియజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన శనివారం ఉదయం చిత్తూరు లోని ఎస్టేట్ వద్ద ఇంటికి వచ్చి చూడగా శాంతి మృతి చెందిందని అత్తింటి వారు తెలియజేశారు. మిద్దపై నుంచి కింద పడినప్పుడు తీవ్ర రక్త గాయాలు కావడంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించామని భర్త నాగరాజు తెలిపాడు. అప్పటికే శాంతి చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆగ్రహించి మీరే మా బిడ్డను పొట్టన పెట్టుకున్నారంటూ వారిపై దాడి చేయడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తమ కుమార్తె శాంతిని ఆమె అత్త , మామలు వీరన్న , పుష్పలత భర్త నాగరాజు మిద్దె పైనుంచి తోసి హత్య చేశారంటూ తల్లి పార్వతమ్మ ఇతర కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వన్ టౌన్ సీఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహాలు కాదు..కళాశాల నిర్మించు స్వామీ: ఎన్ మునిచంద్రా రెడ్డి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: వై ఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు పెట్టడం కాదు..అక్కడ నిర్మిస్తామన్న వైఎస్సార్ డిగ్రీ కళాశాల ను నిర్మాణం ప్రారంభించాలి స్వామీ అని రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వచ్చికావల్లం పరిధిలో వైఎస్సార్ డిగ్రీ కళాశాల నిర్మాణం చేపడతామని కొంత భూమిని సేకరించి హడావుడి చేశారన్నారు.ఇంతవరకు పునాదులకు కూడా నోచుకోలేదని అన్నారు.అందుకు ఒక అభివృద్ధి కమిటీ ని కూడా నియామకం చెయ్యడం సిగ్గుచేటన్నారు. మూడేళ్ళ గడుస్తున్నా కళాశాల నిర్మాణం కు నోచుకోకపోగా ఆ స్థలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేయడం దురదృష్టకరం అన్నారు.వైకాపా ఏమయితే కళాశాల నిర్మాణం చేస్తామని జనానికి మాట ఇచ్చారో అది కట్టుబడి ఉండాలన్నారు .అలా కాకుండా కళాశాల నిర్మాణం చేపట్టాలనుకున్న స్థలంలో విగ్రహాలు పెట్టడం ఎంతవరకు సబబు అన్నారు.వైఎస్సార్ మీద ఈ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రానున్న సార్వత్రిక ఎన్నికల లోపు మీహామీ కళాశాల నిర్మాణం పూర్తి చేసి ప్రజాక్షేత్రం లోకి ఓట్లు కోసం వెళ్లాలని అన్నారు. పునాది వేయలేని స్థితి లో ఉండి కూడా కొందరు వైకాపా నాయకులు అభివృద్ధి కమిటీ పేరు తో జబ్బలు చరుచుకుంటూ సునకానందం పొందుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు.అందులో ఒకరిద్దరు కమిటీ కే గుడ్ బై చెప్పేసారని అన్నారు.విగ్రహాల ఏర్పాటు కాదు విద్యార్థులకు సత్వరమే డిగ్రీ కళాశాల నిర్మాణానికి చొరవ తీసుకోవాలని అన్నారు.అలా కాని పక్షంలో విద్యార్థులే తగిన గుణపాఠం చెప్పేరోజులు ఉన్నాయని అన్నారు.

అక్రమ మద్యం వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర - కార్వేటినగరం: అక్రమ మద్యం వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్.ఐ భాస్కర్ తెలిపారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పెద్ద దళితవాడలో జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు అక్రమ మద్యం వ్యాపారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ యుతవత మత్తుపానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్యంలోనే మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి బాల్యాన్ని వృధా చేసుకోకూడదని అన్నారు. అదే విధంగా విద్యార్థులు, యువత దురలవాటుకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, యువత పలువురు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ఇళ్ల భాదితులకు అన్యాయం చేస్తే

చూస్తూ ఊరుకోం

స్మశాన స్థలం ను సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం
తిరుచానూరు పోలీసుల అత్యుత్సాహం ఎవరు మెప్పుకోసం
సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ హెచ్చరిక

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి రూరల్ పద్మావతి పురం గ్రామపంచాయతీ పరిధిలో రోడ్ల విస్తరణ భాగంలో ఇండ్లు కోల్పోయిన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో అన్యాయం జరిగితే చూస్తూ ఊరు కోమని సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ తీవ్రంగా హెచ్చరించారు శనివారం ఇళ్ల స్థలాల కోసం సదును చేసిన స్థలంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ ఆందోళన కారులకు తిరుచానూరు పోలీసులకు తీవ్రమైన వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ సందర్భంగా సిపిఐ కార్యకర్తలను సీఐ సుబ్రహ్మణ్యం రెడ్డి నాయకత్వంలో బలవంతంగా లాక్కెళ్ళి అరెస్టులు చేయడం దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం జరిగింది. ఈ దౌర్జన్యాన్ని ఉద్దేశించి సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ పద్మావతి పురం గ్రామపంచాయతీ పరిధిలో అత్యంత పేదవాళ్ల ఇల్లు కోల్పోయి ఇప్పటికి నాలుగు నెలలు గడుస్తున్న వారికి రెవెన్యూ అధికారులు స్థలాలు చూపించకుండా నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకొని స్థానిక నాయకులు కొంతమంది ఆ స్థలాన్ని కబ్జా చేసి నిరుపేదలకు అన్యాయం చేయాలని చూడడం మంచి పద్ధతి కాదని, ఇండ్లు కోల్పోయిన వారికి కాకుండా మరెవరికైనా అక్కడ ఇళ్ల స్థలాలు పంపిణీ జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తిరుపతి నగరంలో రోడ్ల విస్తరణ చేయడం నగర అభివృద్ధిలో భాగమని అందుకు సిపిఐ పార్టీ సంపూర్ణంగా మద్దతును తెలియజేస్తున్నదని ఆయన గుర్తు చేశారు. అయితే రోడ్ల విస్తరణ పేరుతో బాధితులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ధర్నా దగ్గరికి విచ్చేసిన బాధితులు నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి సిపిఐ దగ్గరుండి ఇంటి స్థలాలు కేటాయిస్తుందని ఎవరు అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు . అదేవిధంగా తిరుచానూరు పోలీసులు కూడా అత్యుత్సా హాన్ని ప్రదర్శించకుండా వారి విధి ధర్మాన్ని వారు పాటించాలని అలాకాకుండా అధికార పార్టీకి వత్తాసు పలికే పద్ధతులలో వ్యవహరించడం రాజ్యా ంగ విరుద్ధమని పోలీసులకు సూచించారు. పోలీసులు ప్రజాస్వామ్యంగా ఉండాలే కాని పోలీసులే అరాచకాన్ని ప్రేరేపించేలా ఉండకూడదని గుర్తు చేశారు. భారీ ఎత్తున పోలీసులకు ఆందోళన కారులకు మధ్య తోపులాట జరగడం తో సీపీఐ కార్యకర్తలకు గాయాలు కూడా జరిగాయన్నారు. ఈ గాయాలకు కారణం పోలీసులే నని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి నదియా తిరుపతి నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి , ఎం రామకృష్ణ, కే పద్మనాభరెడ్డి, ఎన్ శివా , కె వై రాజా , ఉదయ్ కుమార్ బండి చలపతి, ఎన్. మంజుల ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాయి, హ రికృష్ణ , సురేష్, వెంకటేష్, పూర్ణ, జె నాగరాజు దప్పు సూరి, సుబ్బు, మునేశ్వర్,లక్ష్మి,ప్రమీల, విజయ, అలివేలు, అఖిల తదితరులు పాల్గొన్నారు

టాక్సీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తిరుమలలో టాక్సీ లకు గ్రీన్ జోన్ ప్రకటించాలి
ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర- తిరుపతి : నిరంతరం ప్రజా రవాణాలో తలమునకులై పనిచేస్తున్న టాక్సీ కార్మికులకు సరైన గుర్తింపు ఇవ్వడం కోసం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శనివారం స్థానిక బైరాగి పట్టేడ లోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి మెమోరియల్ హాల్ నందు టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఎల్ కె నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశమునకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ టాక్సీ నడుపుతున్న కార్మికులకు నిరంతరం పోలీసుల నుండి తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఇది సరైనటువంటిది కాదని ఆయన సూచించారు .ఈ చలానా పేరుతో వేధింపులు తిరుమలలో రెడ్ జోన్లు ప్రకటించి ఇబ్బందులు పెట్టడం లాంటివి అనేకం జరుగుతూ ఉన్నాయి, తిరుమలలో తక్షణమే రెడ్ జోన్లను రద్దుచేసి గ్రీన్ జోన్లుగా ప్రకటించి టాక్సీ కార్మికులకు అనుకూలంగా ఉండే విధంగా తిరుమల పోలీస్ వారు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టాక్సీ కార్మికులు ఉన్నత చదువులు చదివి రాష్ట్రంలో ఉద్యోగాలు లేని అత్యంత పేద వారందరూ బతుకుతెరువు కోసం ఈ జీవన విధానాన్ని ఎంచుకున్నారే తప్ప మరోది కాదని అయినా వీరిపై అనేక రకాల ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. అందుకోసమే ప్రభుత్వం ట్యాక్సీ కార్మికుల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేయాలని , తిరుపతి నగరంలో అనుకూలమైన వాతావరణంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి ప్రతి కార్మికునికి ఈఎస్ఐ సదుపాయం కల్పించేలా ప్రభుత్వం సహకరించాలని కోరారు. టాక్సీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ కూడా తీసుకొని దశలవారీగా పోరాటం నిర్వహిస్తామని ఆయన కార్మికులకు భరోసా ఇచ్చారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఏ ఐ టి యు సి నగర ప్రధాన కార్యదర్శి ఎన్.డి.రవి ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీ బాల, అధ్యక్షులు ఆర్ వి రమేష్ , ఎల్ కె నాయుడు, రైల్వే బాల, వై చంద్ర, సి ప్రభాకర్ , సిహెచ్ నాగరాజు, పి కిరణ్ , రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శశిధర్ రాజును పరామర్శించిన సాకం నాగరాజు

విశాలాంధ్ర - తిరుపతి: ముంగర శశిధర్ రాజు తెలుగు భాషోద్యమ సమితి కార్యవర్గ సభ్యులుగ, కార్యదర్శిగల 15 సం. రాలు పాటు భాషా సాహిత్యాలకు విశేష సేవలు అందించారని సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సాకం నాగరాజ అన్నారు.ప్రస్తుత అనారోగ్యం నుంచి త్వరగా కోలుకుని ఆయన సమితి కార్యక్రమాలలో యధాప్రకారం పాల్గొనగలరని ఆకాంక్షను వ్యక్తపరిచారు. 13 వ తేది శనివారం సాయంత్రం జీవకోనలో తన నివాసంలో తీవ్ర అనారోగ్యంతో వుంటున్న శశిధర్ రాజును పరామర్శించినవారిలో సమితి ప్రధాన కార్యదర్శి టెంకాయల దామోదరం, కార్యవర్గ సభ్యులు డా. తమటం రామచంద్రా రెడ్డి, డా. మన్యం నరసింహులు, డా. మోహన ముని శిద్దా రెడ్డి, డా. పొక్కళ్ల సుభద్ర, వాకా ప్రసాద్, జె. రమేష్ బాబువున్నారు.

తో(టో)ల్ తీస్తున్నారు...!

మళ్లీ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం - సామాన్యుడి బతుకు కుదేలు

విశాలాంధ్ర-తొట్టంబేడు : 'కాదేదీ వడ్డనకు అనర్హం' అన్న రీతిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నింటిపై ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతోంది. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెంచి, సామాన్యుడి నడ్డి విరుస్తున్న మోదీ సర్కార్ తాజాగా జాతీయ రహదారులపై టోల్ చార్జీలను 5నుంచి 10శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ధరలు ఏప్రిల్ నుంచి అమల్లోకి తెచ్చింది. ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో టోల్ రుసుము పై కేంద్రం సమీక్ష చేస్తుంది. దీన్ని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ) అధికారులు ధ్రువీకరించి ఏ మేరకు టోల్ ఛార్జీలు పెంచాలో నిర్ణయిస్తారు. అయితే ఈ సారి ఏకంగా 10 శాతం మేర టోల్ చార్జీలు పెరగడంతో సామాన్యుడిపై పెను భారం పడే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఉన్న 58 టోల్ ప్లాజాల్లో ఏప్రిల్ 1 నుంచి పెరిగిన ఫీజులు అమల్లోకి రావడంతో వాహనదారులు లబోదిబోమంటున్నాడు.తిరుపతి జిల్లా చింతలపాళ్లెం, నాయుడు పేట వద్ద టోల్ ప్లాజాలు ఉండగా... వీటి నుంచి నిత్యం 10వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా రహదారుల నిర్మాణం, నిర్వహణ లోపాలు పట్టించుకోని నేషనల్ హైవే అథారిటీ ధోరణిపై ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా చార్జీల పెంపు నిర్ణయంపై జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూపోతున్న కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని నేషనల్ హైవే టోల్‌ప్లాజాల వద్ద చార్జీలను పెంచడంతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో ధరలు ఆకాశాన్ని అంటగా పేద, మధ్యతరగతి ప్రజల బతుకు భారంగా మారింది. ధరలు తగ్గించాలని వామపక్షాలు, ప్రజలు, ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. త్యం రూ.10 లక్షల అదనపు భారం తిరుపతి జిల్లాలో ఉన్న టోల్‌ప్లాజాల నుంచి నిత్యం సుమారు 10 వేల వరకు వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు కూడా వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తాయి. ప్రస్తుతం టోల్‌ప్లాజాల్లో కార్లు, జీపులు లైట్ మోటార్ వెహికిల్స్‌పై 24 గంటల్లో రాకపోకలకు రూ.150, మినీ బస్సు, లైట్ కమర్షియల్ వెహికిల్‌కు రూ.240, బస్సులు, ట్రక్కులకు రూ. 500కు పెరిగింది. ఇతర భారీ వాహనాలకు రూ.545, రూ.865, రూ.955 వరకు ఉంది. కేంద్రం పెంచిన ధరల కారణంగా 5 శాతం మేర చార్జీలు పెరిగాయి. దీంతో రోజూ ప్రయాణికులపై రూ.10 లక్షల అదనపు భారం పడుతోంది. ప్రైవేటు వాహనదారులతో పాటు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే పేదలు సైతం నష్టపోవాల్సి వస్తోంది. ప్రతి యేటా బాదుడే: వేణు, వాహనదారుడు. టోల్‌ప్లాజాల ధరలు గత ఏడాది కూడా పెంచారు. ఇలా ప్రతి ఏడాది ధరలు పెంచుకుంటూ పోతే సామాన్యుడు ఎలా బతికేది. ఇప్పటికే డీజిల్ ధరలు బాగా పెరిగాయి. డీజిల్, టోల్ ప్లాజా చార్జీలు పెంచుకుంటూ పోతే మేం ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. నేషనల్ హైవే అధికారులు రోడ్ల గురించి మాత్రం పట్టించుకోరు. కానీ చార్జీలు మాత్రం పెంచుకుంటూ పోతారు. తిరుపతి - నాయుడుపేట జాతీయ రహదారిలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

జీవో నెంబరు 1 రద్దు పై హర్షం : సిపిఐ

విశాలాంధ్ర - రేణిగుంట : జీవో నెంబరు 1 ను తప్పు పడుతూ హైకోర్టు జీవోను రద్దు చేసినందుకు సిపిఐ జిల్లా సమితి సభ్యుడు జే. తులసి రాజన్, సిపిఐ మండల కార్యదర్శి చలపతి లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సభలు, రోడ్డు షోలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబ.1 ను తీసుకొచ్చిన విషయం విదితమే. జీవోను తప్పుపడుతూ నిన్న ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పు చాలా సంతోషదగ్గ విషయమని జే. తులసి రాజన్, చలపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సాధరంగా స్వాగతిస్తూ సీపీఐ పార్టీ తరపున ఆనందం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం...

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం - శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి పిలుపు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : కక్షిదారులకు రాజీమార్గమే రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించుకోవచ్చునని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు, హైకోర్టు మరియు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మొదట కోర్టు ఆవరణలో మెడికల్ క్యాంప్ జరిగింది. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి మాట్లాడుతూ.... జాతీయ లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవడానికి సహకరిస్తూ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలని, "రాజీమార్గమే రాజ మార్గంగా" ఎన్నుకొని ఎక్కువ కేసులని పరిష్కరించనికి దోహద పడాలని కోరారు. రాజమార్గంలో కక్షిదారులతో ప్రత్యక్ష పద్ధతిలో కేసుల పరిష్కర వద్ధతే బాగుంటుందని వ్యక్తం చేశారు. ఈ లోక్ అదాలత్ కి కోర్టులో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసుల్లో కక్షిదారులను ఒప్పించి అధిక సంఖ్యలో వాటిని రాజమార్గంలో పరిష్కరించడానికి సమిష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, శ్రీకాళహస్తి కోర్ట్ పరిధిలో ఉన్న అన్ని శాఖల అధికారులు, అన్ని శాఖల బ్యాంకు అధికారులు, బిఎస్ఎన్ఎల్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, కోర్ట్ సిబంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ సంబరాలు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించడంతో శనివారం శ్రీకాళహస్తిలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి డాక్టర్ సముద్రాల బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తెయ్యనాయుడు మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో పాటు కర్ణాటకలో ఆయన చేసిన ఎన్నికల ప్రచారంతో తమ పార్టీని విజయం వరించిదని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన కన్నడ ప్రజలకు డాక్టర్ బత్తెయ్యనాయుడు కృతజ్ఞతలు తెలియచేశారు. రాబోయే ఎన్నికల్లో కూడా రాహుల్ గాంధీ నాయకత్వంలో అన్ని రాష్ట్రాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఆయన కోరారు. నరేంద్రమోదీకి తగిన గుణపాఠం చెప్పాలని బత్తెయ్యనాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె.జానీ భాషా, బి.విజయ్ శేఖర్, టి .శివయ్య, ఈ. గోపి, రాఘవరెడ్డి, నాగూరయ్య, శెట్టిపల్లి శివయ్య, మోహన, వానమ్మ, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారం కై కలెక్టర్ కార్యాలయంకు తరలిరండి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ

విశాలాంధ్ర- తిరుపతి : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 15వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాకు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికుల తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బైరాగి పట్టెడ లోని ఏఐటియుసి కార్యాలయంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కే రాధాకృష్ణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు కు నిర్మాణ కార్మికుల భద్రత కోసం సెస్ రూపంలో ఏర్పాటు చేసుకున్న 1400 కోట్ల పైచిలుకు రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖజానాలో వేసుకోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్మాణ రంగంలో పనిచేయుచున్న తాపీ, సెంట్రింగ్ ఇటుక రాయి ,కంకర ,మట్టిపని ,పెయింటింగ్ , కార్పెంటరి ,ఎలక్ట్రికల్ ,ప్లంబర్, మార్బుల్, తదితర విభాగాలలో కార్మికులందరూ కూడా భవన నిర్మాణ కార్మిక సంఘం లో చేరి యూనియన్ ని స్థాపించుకోవడం జరిగిందన్నారు ఈ కార్మికుల కొరకు సంక్షేమ బోర్డు నిధులను ఖర్చు చేయకపోవడం బాధాకరమన్నారు 2018 నుండి పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ అన్నిటిని రిలీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల కోసం జూన్ ఆరో తారీఖున చలో విజయవాడకు కూడా కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీరాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సొంత ఇల్లు లేక బాడిగిళ్లలో ఉంటూ జీవనో సాగిస్తున్నారని నేడు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక కొరత విధించడంతో కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే పాత పద్ధతిలోనే ఇసుకను ఇవ్వాలని దాని ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు కార్మికుల అన్ని సమస్యలపై మే 15న జరిగే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు భవన నిర్మాణ కార్మికులు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు జోరేపల్లి రామచంద్రయ్య ఏ ఐ టి సి జిల్లా సమితి సభ్యులు చిన్నం పెంచలయ్య ,ఎన్.డి.రవి ,శెట్టిపల్లి రవి, ఎ.పి.బాల , మహీంద్ర, ఎల్కేనాయుడు, ఉదయ్ కుమార్ రామచంద్రయ్య సాయి తదితరులు పాల్గొన్నారు.

శానంబట్లలో మిస్టరీ వరస మంటలు-బిక్కు బిక్కుమంటున్న గ్రామస్తులు.

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం కొత్తశానంబట్లలో మిస్టరీగా వరస మంటలు చెలరేగుతున్నాయి. గ్రామస్తులు బిక్కు బిక్కుమంటూ గడపా ల్సిన పరిస్థితి ఏర్పడింది. 15 రోజుల క్రితం గ్రామంలో ఆరు గడ్డివాములు అకస్మాత్తుగా కాలి పోయాయి. రెండు రోజుల నుండి ఇండ్లలోని బీరువా, అల్మారా లో పెట్టిన బట్టలు, ధాన్యం మిస్టరీగా మంటలల్లో కాలిపోతున్నాయి. శనివారం ఉదయం ఎన్.నరేష్ రెడ్డి ఇంట్లో మంటలు చెలరేగి వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్ పై ఉంచిన బట్టలు నుండి మంటలు చెలరేగి వాషింగ్ మిషన్ పూర్తిగా కాలిపోయింది. సంఘటనా స్థలం చేరుకుని సిఐ ఓబులేసు తమ సిబ్బందితో పరిశీలిస్తుండగానే వెను వెంటనే గంటల వ్యవధిలోనే జయంతి, గోపి కృష్ణారెడ్డి, రోహిణి ఇళ్లలోని మంటలు చెలరేగటంతో మంటల మిస్టరీ పోలీసులకు కూడా అర్థం కాలేదు. డి.ఎస్.పి యశ్వంత్ తాసిల్దార్ శిరీష, ప్రజా ప్రతినిధులు క్రైమ్ పోలీసులు సంఘటనా స్థలం చేరుకున్నారు. డిఎస్పి యశ్వంత్ గ్రామంలో పోలీస్ ఫికిటింగ్ ఏర్పాటు చేస్తామని గ్రామస్తులు భయాందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలన్నారు. బయట ప్రాంత వ్యక్తులను ఎవరినీ గ్రామంలోకి ప్రవేశించనియకుండా చూడాలన్నారు. కాలిన వస్తువులను శాంపిల్స్ తీసుకొని ల్యాబ్ కు పంపించి అతి త్వరలో మిస్టరీని ఛేదిస్తామని యశ్వంత్ తెలిపారు. ఓ ఎస్సై తో సహా సిబ్బంది ని 24x7 గ్రామ శివారులో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని ఓబులేష్ తెలిపారు. చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గ్రామం చేరుకుని గ్రామస్తులను ఓదార్చి బాధిత కుటుంబాలకు 5000 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో ఉన్న ట్రాన్సుఫార్మర్లు, గృహాలలోని విద్యుత్ వైర్లను తనిఖీ చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మిస్టరి మంటలకు తీవ్రంగా స్పందించిన మోహిత్ రెడ్డి మిస్టరీని అతి తొందరలో చేదించాలని పోలీస్ అధికారులను ఆదేశిస్తూ క్లూస్ టీం నిపుణులను రప్పించారు. పరిస్థితి సద్దుమణిగేంత వరకు ఓ ఫైర్ ఇంజన్ గ్రామంలోనే ఉండేటట్లు మోహిత్ రెడ్డి ఏర్పాటు చేశారు. కాలిన బట్టలు వస్తువుల సాంపిల్స్ ను తీసుకొని ల్యాబ్ కు పంపించడం జరిగింది. గ్రామంలో కొంతమంది ఈ మిస్టరీ మంటలకు భయపడి గ్రామం వదిలి సమీప బంధువుల ఇళ్లకు వెళుతున్నారు. ముసలి ముతక చిన్నారులే కాకుండా గ్రామ ప్రజలంతా ఈ వరుస సంఘటనలతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని తీవ్ర భయాందోళనకు గురై క్షణక్షణం ఒక యుగంలాగా గడుపుతున్నారు. తన కార్యక్రమాలను పక్కనపెట్టి గ్రామస్తులను ఓదార్చి ఆదుకోవటానికి వచ్చిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర



నేడు చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం!

1000 టీములతో టోర్నమెంట్ నిర్వహణ
16 గ్రౌండ్లులో తలపడనున్న 15000మంది క్రీడాకారులు - రూ.25లక్షల మేరకు నగదు బహుమతులు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని గ్రామీణ ప్రాంత యువతలో క్రిడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతోంది. అందులో భాగంగా నేడు తుమ్మలగుంట వేదికగా "చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్" ప్రారంభమవుతుంది. చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగే చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంకు ముఖ్య అతిథిలుగా టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర రెడ్డిలు హాజరవుతారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట 1000 క్రికెట్ టీమ్ ల నుంచి 15000 మంది క్రీడాకారులు పాల్గొనేందుకు సరిపడేలా 16 గ్రౌండ్లను సిద్ధం చేయడం జరిగింది. అంతేకాక టోర్నమెంట్ లో పాల్గొన్న ప్రతి టీములు ఎస్ఎస్ కంపెనీకి చెందిన రూ.20వేలు విలువైన క్రికెట్ కిట్ ను ఇవ్వడం జరుగుతుంది. అలాగే ఒక్కొక్క క్రీడాకారునికి బ్రాండెడ్ టీ షర్ట్ తో పాటు పార్టిసిపేట్ మెడల్, పార్టిసిపేట్ సర్టిఫికెట్ లను అందజేస్తారు. టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన వారికి అందమైన ట్రోఫీలతో పాటు రూ.25 లక్షల మేరకు నగదు బహుమతులు అందజేయనున్నారు. తుమ్మలగుంట కేంద్రంగా పండుగ వాతావరణంలో 15 రోజులపాటు నిరాటంకంగా జరిగే చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ కు అన్ని రకాల ఏర్పాట్లును సిద్ధం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డిలు క్రీడామైదానంకు చేరుకుని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు. అందరికీ మాంసాహార విందు భోజనం చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులతో పాటు ప్రేక్షకులకు సైతం రుచికరమైన మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. ఇప్పటికే క్రీడా మైదానంలో వంటకాల తయారీకి సంబంధించిన ప్రత్యేక వంటశాలను కూడా ఏర్పాటు చేయించారు. అలాగే క్రీడాకారులకు త్రాగునీరు, ఎనర్జీ డ్రింక్ ను కూడా ఏర్పాటు చేసి వేసవి తాపాన్ని తట్టకునేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. టోర్నమెంట్ నిర్వహణలో భద్రతా వరమైన సమస్యలు తలెత్తకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేయనున్నారు.

వేప,రావిచెట్టుకి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర -కోట:- కోట పంచాయతీ పరిధిలోని శ్యామసుందరపురం గ్రామంలో వెలసిఉన్న శ్రీఅంకాలమ్మ పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా శనివారం అశ్వతనారాయణ(రావి చెట్టు),ఆద్యమ హాలక్ష్మి(వేపచెట్టు)లకు ఘనంగా కళ్యాణోత్సవం జరిపారు .ఈసందర్భంగా ఆలయప్రాంగణంలో ఉన్న ఈరెండు చెట్లకు విశేషాలంకరణలు చేసి పూజార్లు కళ్యాణమంత్రాలతో సాంప్రదాయబద్ధంగా అశేషభక్త జనసందోహం నడుమ కళ్యాణం జరిపించారు.ఆలయ ధర్మకర్త నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి దంపతులు కళ్యాణ తలంబ్రాలు పోసి పూజలు చేశారు అనంతరం ఉట్టికార్యక్రమం నిర్వహించారు దాతల దాతృత్వంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

డాక్టర్ మస్తాన్ యాదవ్ ఘన స్వాగతం పలికిన పాలెంకోట గ్రామస్తులు

విశాలాంధ్ర - వెంకటగిరి : తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పాలెంకోట గ్రామంలో వెంకటగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్ పర్యటించారుశ్రీ సీత రాముల వారి మందిరం నూతనంగా నిర్మించి కుంభాభిషేకం నిర్వహించారు..గ్రామస్తులు డాక్టర్ మస్తాన్ యాదవ్ కి ఘన స్వాగతం పలికారుఆలయ పూజారి డాక్టర్ మస్తాన్ యాదవ్ గారి పేరిట గోత్ర నామాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు అనంతరం గ్రామస్తులు డాక్టర్ మస్తాన్ యాదవ్ సన్మానించారుఅనంతరం మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ ఇంత అద్భుతమైన గుడిని నిర్మించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు... గ్రామం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందని ఈ గ్రామానికి ఎప్పుడు నా అవసరం ఉన్నా అందుబాటులో ఉండి నా వంతు కృషి చేస్తానని తెలియజేశారుఈ కార్యక్రమంలో దక్షిణ భారతదేశం చార్టెడ్ అకౌంటెంట్ అధ్యక్షులు .చిన్న మస్తాన్ రవి శంకర్ రెడ్డి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు,డాక్టర్ మస్తాన్ యాదవ్ స్నేహితులు పాల్గొన్నారు

డాక్టర్ ను కలిసిన సీనియర్ టిడిపి నాయకుడు మస్తానయ్య

విశాలాంధ్ర - వెంకటగిరి : వెంకటగిరి రూరల్,మొగళ్ళ గుంట,తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షులు "కలవలపూడి మస్తానయ్య" మన డాక్టర్ మస్తాన్ చారిటబుల్ ట్రస్ట్ నందు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది, డాక్టర్ మస్తాన్ యాదవ్ ని కలిసిన వారిలో పిగిలాం గ్రామం పల్లిపాటి వెంకటరమణ ఉన్నారు.ంచి, వైశాఖ మాసం కృష్ణపక్షం బహుళ దశమినాడు 10వ రోజు హనుమజ్జయంతిని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంకు ఆహ్వానం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని గ్రామీణ ప్రాంత యువతలో క్రిడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ప్రతి ఏటా వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతోంది.అందులో భాగంగా ఆదివారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట వేదికగా "చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్" ప్రారంభమవుతుంది.చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంకు ముఖ్య అతిథిలుగా టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి,చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హాజరవుతారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట 1000 క్రికెట్ టీమ్ ల నుంచి 15000 మంది క్రీడాకారులు పాల్గొనేందుకు సరిపడేలా 16 గ్రౌండ్లను సిద్ధం చేయడం జరిగింది.అంతేకాక టోర్నమెంట్ లో పాల్గొన్న ప్రతి టీములు ఎస్ఎస్ కంపెనీకి చెందిన రూ.20వేలు విలువైన క్రికెట్ కిట్ ను ఇవ్వడం జరుగుతుంది.అలాగే ఒక్కొక్క క్రీడాకారునికి బ్రాండెడ్ టీ షర్ట్ తో పాటు పార్టిసిపేట్ మెడల్, పార్టిసిపేట్ సర్టిఫికెట్ లను అందజేస్తారు. టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన వారికి అందమైన ట్రోఫీలతో పాటు రూ.25 లక్షల మేరకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం

విశాలాంధ్ర - పెళ్లకూరు : మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామం నందు శనివారం సూళ్లూరుపేట శాసనసభ్యులు మరియు టీటీడీ బోర్డు మెంబర్ కిలివేటి .సంజీవయ్య ఆధ్వ ర్యంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్ర మంలో మండల నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వము ద్వారా వారు పొందిన లబ్దిని తెలియజేసి, కరపత్రాలు పంచడం జరిగినది. ఇదే అభివృద్ధిని మీరు మళ్లీ పొందా లంటే 2024 లో వచ్చేటటువంటి ఎన్నికల్లో తిరిగి జగనన్నకు ఓటు వేసి, మరల జగన్మోహన్ రెడ్డిని సీఎం గ చేయవలసిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ పోలంరెడ్డి. శేఖర్ రెడ్డి, జడ్పిటిసి ఎన్. ప్రిస్కిల్లా, వైఎస్సార్సీపీ మండల ప్రెసిడెంట్ సుధా కర్, చైతన్య కృష్ణారెడ్డి, కే. సుబ్రహ్మణ్యం, వెంకంరాజు, అన్ని శాఖల అధికారులు, వైయస్సార్సీపి ఎంపీటీసీలు ,సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెగా...! ఇదేం దౌర్జన్యమయ్యా...?

- దళితుల భూమికి వెళ్లే దారి తవ్వేశారు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: జాతీయ రహదారి విస్తరణ పనుల పేరుతో మెగా కంపెనీ అక్రమ తవ్వకాలకు పాల్పడు తోంది. ఏదో ఒకచోట తవ్వకాలకు అనుమతి పొందడం... నిబంధన ఉల్లంఘించి చుట్టూ ఉన్న భూముల్లో మట్టి తవ్వేసి తరలించడం. ఇలా అక్రమ తవ్వకాలు చేయడం మెగా కంపెనీ వారికి అలవాటుగా మారిపోయింది. మెగా కంపెనీ తీరుతో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల రైతులు లబోదిబోమంటున్నారు. అధికార పార్టీ నేతల నుంచి 'మెగా' వారికి అండదండలు ఉండటంతో రైతులు ప్రశ్నించలేక కన్నీటి పర్యంతమవుతున్నారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తిలో నిరుపేద దళిత రైతులు ఇలానే బాధ పడాల్సి వస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి రెవిన్యూ పరిధిలోని నేరేడుగుంట వద్ద వై.కోటేశ్వరబాబు, వై.కృష్ణమూర్తి అనే దళిత రైతులకు ప్రభుత్వం సాగు భూమి ఇచ్చింది. ఈ భూమి ఆధారంగా ఈ దళిత రైతులు జీవనం సాగి స్తున్నారు. కోటేశ్వరబాబు, కృష్ణమూర్తి తమ భూమిలోకి వెళ్లాలంటే నేరేడుగుంట కాలువ దాటి వెళ్లాలి. ఎంతోకాలంగా ఈ దారి ఉంది. అయితే నీటిపారుదలశాఖ అధికారులు నేరేడుగుంట కాలువలో మట్టి తవ్వుకోవడానికి మెగా కంపెనీ వారికి అనుమతి ఇచ్చారు. ఇదే అదనుగా ఆ కంపెనీ వారు నేరేడుగుంట కాలువలో 15అడుగుల వెడల్పు, 20 అడుగుల లోతుతో యంత్రాల సాయంతో మట్టి తోడేశారు. ఇలా చేయడం వలన కోటేశ్వరబాబు, కృష్ణమూర్తి భూమిలోకి వెళ్లడానికి దారి పూర్తిగా మూసుకు పోయింది. నేరేడుగుంట కాలువ వద్ద తమ పొలాలకు వెళ్లే దారిని మెగా కంపెనీ వారు తవ్వేస్తున్నారని తెలుసుకున్న కోటేశ్వరబాబు, కృష్ణమూర్తితో పాటు వారి కుటుంబ సభ్యులు శనివారం అక్కడకు వెళ్లారు. మట్టి తవ్వద్దని అడ్డుకున్నారు. అయినా వారు ఖాతరు చేయక పోవడంతో శ్రీకాళహస్తి ఇన్ ఛార్జి తహసీల్దారు రూప్ చంద్ కు ఫిర్యాదు చేశారు. మట్టి తవ్వడానికి తాము అనుమతి ఇవ్వలేదని... నీటి పారుదలశాఖ వారు ఇచ్చారని ఆయన చెప్పారు. రెవిన్యూ సిబ్బందిని పంపి ఈ ఘటనపై విచారణ జరుపుతామని రూప్ చంద్ హామీ ఇచ్చారు. అంతేగానీ వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కాగా తమ వ్యవసాయభూమిలోకి వెళ్లే దారిని దౌర్జన్యంగా తవ్వేసిన మెగా కంపెనీ వారిపై చర్యలు తీసుకోవాలని దళిత రైతులు కోటేశ్వరబాబు, కృష్ణమూర్తి డిమాండు చేస్తున్నారు. లేదంటే తాము ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. అదేవిధంగా నేరేడుగుంట కాలువ తవ్వడానికి అనుమతి ఇచ్చిన నీటిపారుదల శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేస్తున్నారు.